# 10

# మంచి సైనికునియొక్క శీలము

*"నా కుమారుడా, క్రీస్తుయేసునందున్న కృపచేత బలవంతుడవు కమ్ము. నీవు అనేక సాక్షులయెదుట నా వలన వినిన సంగతులను ఇతరులకు బోధించుటకు సామర్థ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము. క్రీస్తు యేసు యొక్క మంచి సైనికునివలె నాతోకూడా శ్రమను అనుభవించుము. సైనికుడెవడును యుద్ధమునకు పోవునప్పుడు, తన్ను దండులో చేర్చుకొనినవానిని సంతోషపెట్ట వలెనని యీ జీవన వ్యాపారములలో చిక్కుకొనడు. మరియు జట్టియైనవాడు పోరాడునప్పుడు నియమ ప్రకారము పోరాడకుంటే వానికి కిరీటము దొరకదు. పాటుపడిన వ్యవసాయకుడే మొదట ఫలములలో పాలు పుచ్చుకొనవలసినవాడు ... మనమాయనతోకూడా చనిపోయినవారమైతే ఆయనతోకూడా బ్రదుకుదుము. సహించినవారమైతే ఆయనతోకూడా ఏలుదుము. ఆయనను ఎరుగమంటే మనలను ఆయన యెరుగననును. మనము నమ్మకపోయినను, ఆయన నమ్మదగినవాడుగా ఉండును; ఆయన (తన స్వభావమునకు విరోధముగా ఏదియు చేయలేదు) తన్ను తానెరుగననలేడు" (2 తిమోతి 2:1-13).*

క్రైస్తవ జీవితము సంఘర్షణతో కూడిన జీవితమైయుంది. యేసు క్రీస్తు యొక్క సువార్తకు మనము లోబడినప్పుడు, "విశ్వాససంబంధమైన మంచి పోరాటము" మూడు విధములైన శత్రువులకు విరోధంగా: పాతాళ సంబంధియైన శత్రువు, సాతాను; బాహ్య శత్రువు, లోకము; అంతరంగ శత్రువు, శరీరము. ఈ మూడు చాలా బలమున్న శత్రువులు, వాటిని విజయవంతంగా ఎదిరించడానికి ప్రభువు యొక్క మహా శక్తి మాత్రమే కావాలి. ఈ విధంగా క్రైస్తవ జీవితంలోని సంఘర్షణ "విశ్వాస పోరాటంతో" కూడినదైయుంది, దాన్ని జయించడానికిగాను మనము క్రీస్తు వైపు చూచి నేర్చుకోవలసియుంది.

మంచి సైనికుడుగా పౌలు నమ్మకం సంపూర్ణంగా ప్రభువైన యేసు క్రీస్తు మీదనే కేంద్రీకరించబడింది. పౌలు యిలా వ్రాశాడు, "... నేను నమ్మినవాని ఎరుగుదును గనుక సిగ్గుపడను; నేను ఆయనకు అప్పగించినదానిని రాబోవుచున్న ఆ దినమువరకు ఆయన కాపాడగలడని రూఢిగా నమ్ముకొనుచున్నాను" (2 తిమోతి 1:12). పౌలు నమ్మిక ప్రభువుతో ఎక్కువ కాలం గడపడం మీద ఆధారపడి జన్మించిందే, అన్ని విషయములలోను అన్ని పరిస్థితులలోను ఆయనవైపు తేరిచూచి ఆయనయందు నమ్మకం కలిగి ఉండడం నేర్చుకొన్నాడు.

క్రీస్తు యొక్క మంచి సైనికుడుగా ఉండేవాని శీలాన్ని గూర్చి చూద్దాం. ఏ సైన్యానికైనా వేర్వేరు రకాలైన సైనికులుంటారు. కొందరు సైన్యానికి తమను తాము పూర్ణంగా అప్పగించుకునేవారు ఉన్నారు, మరికొందరు నిజంగా పట్టించుకోరు. క్రీస్తు

యొక్క మంచి సైనికుని యొక్క శీలం ఎలా ఉండాలని దేవుని వాక్యము చెప్పుతుందో ఈ పాఠంలో మనం చూద్దాం. 2 తిమోతి 2:1–13లోని గుణ లక్షణాల్నీ మనం పరీక్షిస్తుండగా, మన జీవితాల్లో అలాటి లక్షణాలు ఉన్నవో లేవో పరీక్షించుకొందాం.

## మంచి సైనికుడు బలవంతుడు (1 వ.)

ప్రభువు యొక్క మంచి సైనికుని మొదటి లక్షణం బలము: "నా కుమారుడా, క్రీస్తు యేసునందున్న కృపచేత బలవంతుడవు కమ్ము" (1 వ.).

ఈ వచనంలో పౌలు ఆజ్ఞాపించిన బలం భౌతికమైన శరీర బలమో, ప్రాణమునకుండే మనో బలమో కాదు, కాని మనయందు నివసించే పరిశుద్ధాత్మ ద్వారా, దేవుని కృపచేత ప్రవహించే ఆత్మసంబంధమైన బలమైయుంది. క్రీస్తునందు విశ్వాసమువలన జీవించ నిష్టపడిన ఎవడైనను పొందగల బలమే ఆత్మసంబంధమైన బలము. అలాటి బలము మొదటిగా మనము మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినప్పుడు మనలోనికి ప్రవహిస్తుంది (అపొ. 2:38). ఆ సమయమందు విశ్వాస సంబంధమైన మంచి పోరాటం పోరాడడానికి మనకు అవసరమైన బలమును కృపను ప్రసాదించడానికిగాను పరిశుద్ధాత్మ మన హృదయములలోనికి వస్తాడు.

విశ్వాసంవలన జీవించే వారికి అనుగ్రహింపబడే బలమును బట్టి పౌలు దేవుని స్తుతించుచూ యీలా వ్రాశాడు, "మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగువాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవునికి, క్రీస్తుయేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగును గాక. ఆమెన్" (ఎఫెసీ. 3:20, 21).

ఆయన మహిమకొరకు మనము క్రైస్తవ జీవితాన్ని జీవిస్తుండగా, దేవుడు మనతో ఉండి, మనలను బలపరుస్తానని వాగ్దానం చేశాడు. బలహీనమైన దేహ ప్రాణాలనుండి పైకి చూచి, క్రీస్తు ప్రభువు మీద దృష్టిని నిలిపేవారు పౌలుతో యిలా చెప్పగలరు; "నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను" (ఫిలిప్పీ. 4:13).

## మంచి సైనికుడు స్వార్థరహితుడు (2 వ.)

రెండవది, యేసు క్రీస్తుయొక్క మంచి సైనికుడు పంచుకునేవాడు: "నీవు అనేక సాక్షులయెదుట నావలన వినిన సంగతులను ఇతరులకును బోధించుటకు సామర్థ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము" (2 వ.).

మంచి సైనికుడు ఎన్నడు స్వార్థపరుడుగా ఉండడు, కాని తన భోజనాన్ని ఆత్మసంబంధమైన తన ఆయుధ సామాగ్రిని, యింకా కలిగియున్న దేనినైనా తన తోటి సైనికులతో పంచుకుంటాడు. తనతో కూడా సాతాను సంబంధమైన శక్తులతో పోరాడే వారికి తనవలన అయిన సహాయం చేస్తాడు. ప్రభువు యొక్క సైనికుల విషయంలో అదే సత్యం.

ప్రభువైన యేసునందలి మన విశ్వాసం ద్వారా మన హృదయాలలో ప్రకాశించే వెలుగు మరియు ఆయన ప్రశస్తమైన వాక్యము విశ్వాస సంబంధమైన మంచి

పోరాటం పోరాడడంలో బహు విలువగలదై యుంటుంది. మంచి సైనికుడు వాక్యంచేత తన హృదయాన్ని నింపుకొనడం మాత్రమేగాక, స్వార్థరహితంగా తన జ్ఞానాన్ని తన తోటి యోధులకును పంచుతాడు; తిరిగి వారు యితరులకు పంచుతారు.

భార్యాభర్తలు తమకు కలిగిన జ్ఞానాన్ని ఒకరికొకరు పంచుకొంటారు. తల్లిదండ్రులు వారి బిడ్డలకు దానిని పంచి పెట్టవలసిన అవసరం ఉంది. ముత్తవ్వలు ఆ జ్ఞానాన్ని తమ మనుమలకు పంచవలసినవారై ఉంటారు. బైబిలు క్లాస్ టీచర్స్ వారి విద్యార్థులతో పంచుకోవలసి ఉంటారు. పెద్దలు, పరిచారకులు సువార్తికులు స్థానిక సంఘంలోని యితర సభ్యులతో దాన్ని పంచుకోవలసియుంటారు. క్రైస్తవులందరు చీకటిలో ఉన్నవారితో దాన్ని పంచుకొంటూ, వారుకూడా దేవుని సైన్యములో చేరిన శత్రువుకొరకు కాక ప్రభువు కొరకు వారితో పోరాడాలి.

## మంచి సైనికుడు బాధననుభవించడానికి యిష్టపడతాడు (3 వ.)

మంచి సైనికుని యొక్క మూడవ గుణలక్షణము – శ్రమ అనుభవించడానికి సిద్ధపడినవాడైయుండాలి. ప్రభువు కొరకైన శ్రమానుభవం నేడు అనేకమంది ప్రజలకు ఇష్టమైన సందేశంగా ఉండదు, కాని పరలోక సంబంధమైన సీయోనుకు సాగిపోయే సైనికులకైతే, శత్రువునుండి వ్యతిరేకత, హింస కలుగునని దేవుని వాక్యము తెలియజేసింది. ప్రభువు మనకొరకు ఎలా బాధ అనుభవించాడో, పరిశుద్ధమైన, తన పనికొరకు అలాగే బాధ అనుభవించడానికి పిలువబడ్డాడు.

పౌలు తిమోతిని ఎలా పిలిచాడో అలాగే మనమును పిలువబడ్డాం. 2 తిమోతిలో మనం యిలా చదువుతాం.

> దేవుని శక్తినిబట్టి సువార్త నిమిత్తమైన శ్రమానుభవములో పాలివాడవై యుండుము (1:8).
>
> ఆ హేతువుచేత ఈ శ్రమలను అభవించుచున్నాను గాని, ... సిగ్గుపడను (1:12).
>
> క్రీస్తుయేసు యొక్క మంచి సైనికునివలె నాతో కూడ శ్రమను అనుభవించుము (2:3).
>
> ...ఆ సువార్త విషయమై సంకెళ్లతో బంధింపబడి శ్రమపడుచున్నాను ... (2:9).
>
> క్రీస్తుయేసునందు సద్భక్తితో బ్రదుకనుద్దేశించువారందరు హింసపొందుదురు (3:12).

క్రొత్త నిబంధన ఆరంభమునుండి ముగియువరకు, క్రీస్తుయొక్క సైనికుడుగా ఉండడంలో శ్రమానుభవము ఒక భాగమైయున్నట్టు మనం తెలుసుకున్నాం. మొదట సిలువ వస్తుంది, ఆ మీదట కిరీటం దక్కుతుంది. సిలువ యొక్క పరిశ్రమ లేకుండ

అనంతమైన కీర్తి కిరీటము దక్కదు.

## మంచి సైనికుడు ఏక దృష్టిగలవాడై యుంటాడు (4 వ.)

క్రీస్తు యొక్క మంచి సైనికుని నాల్గవ గుణలక్షణం అతడు ఏక దృష్టికలవాడై యుంటాడు. పౌలు యిలా అన్నాడు, "సైనికుడెవడును యుద్ధమునకు పోవునప్పుడు, తన్ను దండులో చేర్చుకొనినవానిని సంతోషపెట్టవలెనని యీ జీవన వ్యాపారములలో చిక్కుకొనడు" (4 వ.).

"చిక్కుకొనడు" అనే పదం, క్రీస్తు యొక్క సైనికుడు జాగ్రత్తగా ఉండకపోతే ఏమి సంభవిస్తుందో సూచిస్తుంది. మన లోకం కలతలతో, చింతనలతో, వివిధములైన భోగములతో నిండుకొనియుంది. మార్గంనుండి తొలిగించే యిన్ని రకాలైన వాటిమధ్య, క్రీస్తును ఆయనతో మనకున్న బాంధవ్యాన్ని మన మనస్సుల్లో వెనుకకు నెట్టి వేసే అవకాశముంది. లోకసంబంధమైన కార్యములు జరిగించడంలోను, లోక భోగములను అనుసరించడంలో ఎంత బిజీగా ఉండిపోతామంటే, మనకు తెలియకుండగనే బైబిలు చదవడానికిని, ప్రార్థించడానికిని సమయం లేకుండా పోతుంది. స్థానిక సంఘము యొక్క బైబిలు తరగతులకు గాని, కడకు ఆరాధనకు గాని సమయం ఉండదు. మన ధనాన్ని గాని, సమయాన్ని గాని, తలాంతులను గాని సంఘంకొరకు పనిచేయడానికి వెచ్చించం. ఆయనయందుగాని, ఆయన ప్రేమ కార్యములయందుగాని ఆశ లేనివారమై ప్రభువునుండి నెమ్మదిగా దూరమై బాధలేని ఆత్మ సంబంధమైన మరణాన్ని ఫలితంగా పొందుతాం!

మత్తయి 13లోని విత్తువాని గూర్చిన ఉపమానంలో, ముండ్ల పొదలో పడిన విత్తనాలను గూర్చి ప్రభువు తెలిపారు. ముండ్ల పొదలు ఎదిగి ఆ వాక్యమును అణచివేశాయట."... వాక్యము వినువాడే గాని ఐహిక విచారమును ధనమోసమును ఆ వాక్యమును అణచివేయును గనుక వాడు నిష్ఫలుడవును" అని ప్రభువు అట్టివానిని పోల్చాడు (22 వ.).

ఈ జీవన వ్యాపారములలో చిక్కుకొనవద్దు అని పౌలు తిమోతిని హెచ్చరించినప్పుడు, దేవుని వాక్యముగాని, క్రీస్తు ప్రభువుతో తనకున్న సంబంధంకాని తన హృదయంలో అడ్డుకుని పోరాదని పౌలు మనస్సులో ఉన్నదనడానికి ఎట్టి సందేహము లేదు. ప్రభువైన యేసు, ఆయన నీతి, ఆయన నిత్యరాజ్యమునకు మించిన దేదీ తన ఆసక్తిని ఆకర్షించ కుండునట్లుగా, క్రీస్తు ప్రభువు యొక్క సైనికుడు ఏకాగ్రత, ఏక దృష్టిగలవాడై ఉండుట ఎంతో అవసరం.

## మంచి సైనికుడు ఆశానిగ్రహముగలవాడై యుంటాడు (5, 6 వ.)

క్రీస్తు యొక్క మంచి సైనికుడు ఆశానిగ్రహముగలవాడై ఉండడం అవసరమని పౌలు ప్రకటించాడు: "మరియు జెట్టియైనవాడు పోరాడునప్పుడు, నియమ ప్రకారము

పోరాడకుంటే వానికి కిరీటము దొరకదు. పాటుపడిన వ్యవసాయకుడే మొదట ఫలములలో పాలు పుచ్చుకోవలసినవాడు" (5, 6 వ).

పౌలు పోల్చే క్రైస్తవ జీవితం క్రీడలలోని జెట్టియైనవానిలోను, కష్టించి పని చేసే వ్యవసాయదారునితో తిమోతి గుర్తింప చేయబడ్డాడు. ఒలింపిక్ క్రీడలు గ్రీకు దేశస్థులకు బహుప్రాముఖ్యమైనవి. పొగడ్తను పొందే పుష్ప కిరీటాన్ని పొందడానికిగాను ఒక క్రీడా కారుడు శ్రమతోకూడిన సాధన అనుదిన క్రమశిక్షణ అనేవాటికి గురి చేయబడతాడు. పందెపు రంగమందు పరిగెత్తేవాడు నియమ ప్రకారం పరిగెత్తకుంటే బహుమానం దక్కదని వానికే తెలుసు.

ఈ లోకములో క్రైస్తవ జీవితము బహు ప్రాముఖ్యమైన బంధాలతో కూడి నదైయుంది. ప్రభువైన క్రీస్తుకును ఆయన పరిశుద్ధమైన చిత్తానికిని సంబంధించిన విశ్వాసము, నమ్మిక, విధేయత అవసరమైయుంది. క్రీస్తు సైనికులనేకులు (యుద్ధానికి సంబంధించివారి హ్యాండ్ బుక్కులు) బైబిల్లు క్రిందపెట్టి, కొన్ని సార్లు కనీసం చాలా దినాలవరకు దానివైపు చూడక పోవడం శోచనీయం! వారు పత్రికను చదువుతారు, టి.వీ.ని చూస్తారు, వారు చేయదలచుకున్న యితర కార్యకలాపాలన్నీ చేస్తారు, కాని ప్రభువు పలుకులకు తమ చెవులను మూసుకొంటారు. పఠనమందును, ప్రార్థనయందును ఆయన వైపు చూడడానికి నిరాకరిస్తారు!

సహోదరులారా, అది "ఏకాగ్రత కలిగియుండడమో," లేక "వ్యక్తిగత – క్రమశిక్షణ" కలిగి యుండడమో కాదు! నియమ ప్రకారం పందెపు రంగమందు పరుగెత్తుట అనేది అది కాదు! తమ సొంత నియమాలతో పోరాడేవాడెవడును మంచి సైనికుడుగా ఎంచడానికి తగినవాడై లేక యోగ్యుడైయుండడు. అట్టివారు మారుమనస్సు పొంది తిరిగి ప్రభువు సైన్యంలో ఉండేలా చూచుకోవాలి.

## మంచి సైనికుడు ప్రయాసపడతాడు (6 వ.)

ఈ లేఖన భాగంలో పౌలు ఉపయోగించిన చిత్రం కష్టించి పనిచేసే కర్షకుడు (6 వ.). క్రైస్తవ జీవితం తరచుగా కష్టంగా ఉంటుందనే విషయం మన మనస్సులో ముద్రించడా నికి పౌలు ప్రయత్నిస్తున్నాడు. క్రీస్తు ప్రభువును వెంబడించే కార్యక్రమంలో చెమటోర్చి, కొంత కష్టమైన పని చేయవలసియుంది. ప్రభువు మీద ఆనుకొని ఆయన బలముకొరకు సహాయంకొరకు ఓర్పు లేక సహనంతో కనిపెట్టవలసియుంది. దురదృష్టవశాత్తు, మన లోకము సహనం లేని పరిస్థితిలో కొనసాగుతుంది. అప్పటికప్పుడే తయారు చేయబడుతున్న కాఫీ, టీ మొదలుకొని "లైవ్ కవరేజ్" టెలివిజన్‌వరకు ప్రతిదీ మనకు లభ్యమౌతుంది. మనం ఎవరిమీదను దేనికొరకును వేచియుండే పరిస్థితులు తక్కువైపోయాయ్; అయితే మనం ప్రభువుతో ఆయన వాక్య వెలుగులో నడిచినట్లయితే, ప్రభువు యొక్క ఆజ్ఞల ప్రకారమును, ఆయన సూత్రాల ప్రకారం జరిగించవలసినవారమై యుంటాం. మనం పరలోకం వెళ్లదలచుకుంటే, ఆయన మనకు ప్రభువైయుండాలి, మరియు ఆయనకు విధేయులమైన దాసులమైయుండాలి. ఆయన కమాండర్ – ఇన్ – ఛీఫ్ అయ్యుండాలి, మరియు మనం పరలోకపు హెడ్‌క్వార్టర్స్ జారీ చేసిన ఆజ్ఞలకు

లోబడు సైనికులమై యుండాలి.

## ముగింపు

"నేను చెప్పు మాటలు ఆలోచించుకొనుము; అన్ని విషయములయందు ప్రభువు నీకు వివేకమనుగ్రహించును" అని పౌలు తిమోతికి బుద్ధి చెప్పుతున్నాడు (7 వ.). "నేను బైబిలును అర్థం చేసికోలేను. దాని సందేశం గ్రహించగలిగినంత తెలివిగలవాడను కాదు" అని కొందరు అనవచ్చు. నీవు అలా విడిచిపెట్టక ముందు, అతని వాక్యమును గ్రహించేలా ప్రభువు యొక్క సహాయాన్ని కోరు. దేవుని వాక్యాన్ని చదివి, దాన్ని ఆలోచింపగల సమయాన్ని మనం తీసికోగలిగినట్టయితే, దేవుడే మనకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు.

8వ వచనాన్ని "పౌలుయొక్క యుద్ధధ్వని" అని నేను పిలుస్తాను. "నా సువార్త ప్రకారము, దావీదు సంతానములో పుట్టి మృతులలోనుండి లేచిన యేసు క్రీస్తును జ్ఞాపకము చేసికొనుము" అని పౌలు తిమోతిని హెచ్చరించాడు.

క్రీస్తుయేసు కొరకు మంచి సైనికుడవుగా ఉండడానికి యిక్కడ తాళం ఉంది! ఆ తాళం ప్రభువైన యేసే!

"యేసు క్రీస్తును జ్ఞాపకము చేసికొనుము" అని పౌలు చెప్పాడు. ఒక గీత రచయిత చెప్పినట్టు, "యేసును ఉదయమందు, యేసును మధ్యాహ్నపువేళ, యేసును సూర్యాస్తమయమందు" దృష్టిని నిలపడం అవసరం. అనుదినం మనం ఆయనను జ్ఞప్తి చేసికొన్నట్టు సమర్పించుకున్నట్టయితే, క్రీస్తు యేసుకు మనం మంచి సైనికులమై యుంటాం. అప్పుడు, ఈ దినాలలో ఒకనాడు, మన ఆయుధ సామాగ్రిని క్రిందపెట్టి ఆయనతో నిరంతరం ఉండేలా గృహానికి మరలుతాం.

తన సైన్యములో చేర్చబడిన స్త్రీ, పురుషులు నేడు ప్రభువునకు అవసరమైయున్నారు. వారు విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడవలసినవారై యున్నారు! ఆయన మనకు ఆజ్ఞాపించే వాటన్నిటి విషయంలో ఆయనయందు నమ్మికయుంచి ఆయన కృపను బలమును ఆశ్రయించువారమైయుండాలి. మనం నమ్మిక ఉంచి లోబడినట్లయితే, ఆయన మిగిలిన దానిని జరిగించుతాడు, ఎందుకనగా మనము కోరుకొనుటకు మనకు కార్యసిద్ధి కలుగజేయుటకును, తన దయాసంకల్పము నెరవేర్చువాడు దేవుడేనని ఆయనే వాగ్దానం చేస్తున్నాడు (ఫిలిప్పీ. 2:12, 13).